ప్రజల మాట ప్రగతి బాట





ప్రజలతో కలిసి సభలో జీవన్‌రెడ్డి సోదరుడు రాజేశ్వర్‌రెడ్డి సందడి



సీఎం కేసీఆర్ ప్రసంగం వింటూ సభలో ఈలలు వేస్తున్న బీఆర్ఎస్ అభిమానులు

# ఆశీర్వాద సభకు పోటెత్తిన జనం

• స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు

ఆర్మూర్, నవంబర్3: పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ఎన్నిక ప్రచార ప్రజా ఆశీర్వాద సభకు ఆర్మూర్ నియోజకవర్గంలోని ప్రజలు హోరెత్తారు. నియోజకవర్గంలోని నందిపేట్, మాక్లూర్, డొంకేశ్వర్, ఆలూర్, ఆర్మూర్ మండలాల తోపాటు ఆర్మూర్ పట్టణం నుంచి ప్రజలు తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు 63వ జాతీయ రహదారి పక్కన ఉన్న సభా స్థలానికి స్వచ్ఛందంగా చేరుకున్నారు. నాలుగు దిక్కుల నుంచి ఒక్కసారిగా ప్రజలు బస్సులు, వ్యాన్‌లు, ద్విచక్ర వాహనాలపై వచ్చి వారి వారికి కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలను నిలిపి సభకు చేరుకున్నారు. దీంతో ఎటుచూసినా దారులన్నీ కేసీఆర్ సభకు వచ్చే జపంతో కిటకిట లాడాయి. రెండు గంటల ముందే సభా ప్రాంగణం జనంతో నిండిపోయింది. రెండు గంటల పాటు దూం దాం కళాకారుల సంస్కృతికి ప్రదర్శనలు చూస్తూ సభలో లీనమైపోయారు. ముఖ్యంగా సభకు మహిళలు, యువకులు, వృద్ధులు ఉత్సాహంగా తరలివచ్చారు. సిద్దులగుట్ట వెనుక భాగంలోని సభా స్థలానికి వచ్చిన జనాలతో సిద్దులగుట్ట ప్రాంతం జనసంద్రమైంది. ప్రజల కేరింతలు, జై తెలంగాణ నినాదాలతో సభా ప్రాంగణం మరుమోగింది.

**సీఎం నోట జీవన్‌రెడ్డి మాట**

ఆర్మూర్‌టౌన్, నవంబర్3: ఆర్మూర్ పట్టణంలోని ఆలూర్ బైపాస్ రోడ్డు వద్ద నిర్వహించిన సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ నోట ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేరుతో సభ ప్రారంభించడంతో అభిమానుల్లో మరింత జోష్ పెరిగింది. దీంతో అభిమానులు ఎమ్మెల్యే ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేరింతలు కొట్టారు.



సభకు తరలివస్తున్న జనం

### కేసీఆర్ పాలన బాగుంది..



కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలన చాలా బాగుంది. ప్రజలంతా మళ్లీ కేసీఆరే రావాలని కోరుకుంటున్నారు. 2016 రూపాయాల పింఛన్ ఇవ్వడం ఎంతో గొప్ప విషయం. మళ్ల గెలిస్తే దానిని రూ.5వేలకు పెంచుతామని తెలుపడం సంతోషంగా ఉంది. గతంలో రూ.200 పింఛన్ ఎటూ సరిపోయేది కాదు. బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఎంతో న్యాయం జరుగుతోంది.

**-పోహర్ గంగామణి, ఆర్మూర్**

### కేసీఆర్ వెంటే ఉంటాం...



సమైక్య పాలనలో లేని సంతోషం ప్రస్తుతం కేసీఆర్ పాలనలో నెలకొంది. ప్రతి నెలా క్రమం తప్పకుండా పింఛన్లు ఇవ్వడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు., నాకు ప్రతి నెలా రూ.2016 బీడీ పింఛన్ వస్తుంది. దీంతో కుటుంబ గడుస్తోంది. కేసీఆర్‌కు రుణ పడి ఉంటాం. **- శాంతాబాయి, ఆర్మూర్**

### కేసీఆర్‌కే నా మద్దతు..



కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారు. పేదలు రోజుకు రెండు మెతుకులు తింటున్నారంటే ఆది కేసీఆర్ పుణ్యమే. తెలంగాణ వచ్చాక కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారు. గ్రామాల్లో ప్రజలంతా ఎంతో ఆనందంగా జీవిస్తున్నారు. కేసీఆర్‌కే నా పూర్తి మద్దతు. **- చాకలి గంగు, గోవింద్‌పేట్**

### నీటి కష్టాలు తీరాయి..



కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల జీవితాలు మారినవి. ముఖ్యంగా ప్రజలు గతంలో నీటి కోసం ఎంతో ఇబ్బందులు పడేవారు. కానీ ప్రస్తుతం మిషన్ భగీరథతో మా కష్టాలు తీరాయి.

**- కొత్తూర్ లలిత, ఆర్మూర్**

### సార్‌ను వదులకోం..



కేసీఆర్ అందరికీ మంచి పనులు చేస్తున్నాడు. సార్‌ను ఎవరూ వదులుకోరు. ఎటు చూసినా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినా అభివృద్ధి మనకు కనిపిస్తోంది. ఇంకా అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ సార్ మళ్లీ రావాలి.

**- సనుగుల సుమని, సుర్బిర్యాల్**

### నామినేషన్ స్వీకరణ



నామినేషన్ స్వీకరిస్తున్న రిటర్నింగ్ అధికారి వినోద్‌కుమార్

ఆర్మూర్‌టౌన్, నవంబర్3: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వినోద్‌కుమార్ ఎమ్మెల్యే అభ్యర్థి నుంచి నామినేషన్ స్వీకరించారు. స్వంతంత్ర్య అభ్యర్థిగా సుంకె శ్రీనివాస్ నామినేషన్ వేశారు. అధికారులు భారీ బందోబస్తు నడుమ నామినేషన్ పక్రియ నిర్వహిస్తున్నారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నందిపేట(మాక్లూర్), నవబర్ 3: మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నాపూర్ అర్బన్ పార్క్ పక్కన చిల్డ్రన్స్ పార్కులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి వయస్సు సుమారు 30 నుంచి 35 మధ్య ఉంటుందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతురాలికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే మాక్లూర్ పోలీస్‌స్టేషన్ 8712659846, నార్త్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ 8712632843 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

# సీఎం కేసీఆర్ సభ విజయవంతం

ఆర్మూర్, నవంబర్3: ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆర్మూర్‌లో శుక్రవారం నిర్వహించిన కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. లక్షలాదిగా స్వచ్ఛందంగా తరలివచ్చిన జనంతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. కేసీఆర్ సందేశాన్ని వినేందుకు మహిళలు, యువకులు, యువతులు, వృద్ధులు తరలివచ్చారు.

### సభ హైలైట్స్

- కొందరు మహిళలు చంటి పిల్లలను చంకనేసుకొని సభా స్థలానికి చేరుకున్నారు.
- వృద్ధులు, మహిళలు ఉత్సాహంగా సభకు వచ్చారు.
- మధ్యాహ్నం వరకే ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి బస్సులు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాలపై సభా స్థలాకి జనం చేరుకుంది.
- మధ్యాహ్నం 12 గంటల వరకే సభా ప్రాంగణం జనంతో కిక్కిరిసింది.
- 2 గంటల పాటు ధూంధాం కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.
- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సోదరుడు రాజేశ్వర్‌రెడ్డి సభా ప్రాంగణంలో జనంతో కలిసి ప్లకార్డులు చేత పట్టుకొని కేరింతలు కొడుతూ సందడి చేశారు.
- సభలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మర్ డాక్టర్ మధుశేఖర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్, ఓయూ నేత రాజారాంయాదవ్, పట్టణ నాయకులు చేసిన డాన్స్‌లు సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
- మధ్యాహ్నం 3.38 గంటలకు కేసీఆర్ హెలికాప్టర్‌లో సభ వెనుక భాగంలోని హెలిప్యాడ్‌కు చేరుకోగానే సభా ప్రాంగణం జై కేసీఆర్, జై తెలంగాణ నినాదాలతో మారుమోగింది.
- 3.50 గంటలకు సీఎం కేసీఆర్ హెలిప్యాడ్ నుంచి బస్సులో సభా వేదికపైకి వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. కేసీఆర్ రాకతోనే సభా ప్రాంగణం కేరింతలు, ఈలలు, కేకలతో హోరెత్తింది.
- 3.56 గంటలకు ప్రసంగం ప్రారంభించిన కేసీఆర్ ముందుగా అంకాపూర్ గ్రామం, వ్యవసాయ విధానంపై మాట్లాడారు. ఆర్మూర్ దవాఖానకు సాధారణ ప్రసూతిలో అవార్డు





హెలికాప్టర్‌లో ఆర్మూర్ సభకు వస్తున్న కేసీఆర్

రావడాన్ని ప్రస్తావించారు.

- 4.14 గంటల వరకు మొత్తం 18 నిమిషాల పాటు అనేక అంశాలపై సభలో కేసీఆర్ ప్రసంగించారు.
- హెలికాప్టర్‌లో ప్రయాణం.. మరో సభకు వెళ్లాలి... ఇక నాకు సెలవు ఇప్పించండి .. అని సభలో ప్రజలకు తెలుపుతూ ఆర్మూర్ నుంచి కోరుట్లకు వెళ్లారు.